నకిలీకి చెక్ !

వ్యవసాయంలో లాభాల సంగతి దేవుడెరుగు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని నమ్మకాన్ని కోల్పోయిన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత భరోసా కల్పించారు. రైతులు సాగు చేసే పంటకు ప్రాథమిక వనరులైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నాణ్యమైన వాటిని అందించాలనే ఉద్దేశంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు, ఎరువులకు చెక్ పెట్టారు.

- అందుబాటులోకి అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఉచితంగా నాణ్యత నిర్ధారణ పరీక్షలు
- నకిలీ విత్తనాలు, పురుగు మందులకు అడ్డుకట్ట
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులు నష్టపోకుండా మడకశిర నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రెండేళ్ల క్రితమే ఏర్పాటు చేయించారు. ఈ టెస్టింగ్ ల్యాబ్‌కు అవసరమగు నిధులను కేటాయించి పంటల సాగుకు రైతులు వినియోగించే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, తదితర వాటిని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించి తర్వాతనే రైతులు కోనుగోలుకు మార్కెట్‌లోకి విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా, రైతు భరోసా, సున్నా వడ్డీకే బ్యాంకు రుణాలు, కేవలం రూపాయకే పంటల బీమా, వైఎస్సార్ యంత్ర సేవా, వైఎస్సార్ జలకళ పథకం, ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కాయల పంపిణీ తదితర విప్లవాత్మకమైన మార్పులతో వ్యవసాయాన్ని పండుగలా మార్చారు.



మడకశిర మార్కెట్ యార్డులో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

రైతులకు ఎంతో అనుకూలం

నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లోని దాదాపు 69 వేల మంది రైతులకు వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అనుకూలంగా మారింది. ల్యాబ్ ఫలితాలు సకాలంలో అందిస్తున్నారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా ల్యాబ్‌లో పురుగు మందులు, ఎరువులు, విత్తనాల నాణ్యతను ఉచితంగా పరీక్షించి, ఫలితాలను ఆర్బీకేల ద్వారా రైతు ఇంటి వద్దకే చేరుస్తున్నారు. ఈ భవన నిర్మాణానికి, ల్యాబ్‌లో పరికరాలు ఇతర సామగ్రికి రూ.కోటి వరకూ వెచ్చించారు. ఒక ఏఓ, ఇద్దరు ఏఈఓలు పనిచేస్తున్నారు. నకిలీ విత్తనాలకు చెక్ పెట్టడంతో పాటు ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల నాణ్యతను రైతులు తెలుసుకోవచ్చు. వ్యవసాయశాఖ ఏడీఏ ల్యాబ్‌ను పర్యవేక్షిస్తారు.

913 పరీక్షలు

రాష్ట్రంలో ఇతర ప్రాంతాల నుంచి పంపిస్తున్న విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నాణ్యతను అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఇప్పటి వరకూ ఎరువుల శాంపిల్స్ టెస్టింగ్‌లు 281, విత్తనాల శాంపిల్స్ టెస్టింగ్‌లు 632 మొత్తం 913 పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆర్బీకేలకు మట్టి నమూనా పరీక్షల కిట్లను అందించి గ్రామ స్థాయిలోనే రైతులు మట్టి నమూనాల పరీక్షలు చేసుకొనే అవకాశం కల్పించారు. వాటి ఆధారంగా రైతులు పంటలు సాగు చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు.

రైతుల సంక్షేమమే జగన్ లక్ష్యం



పాదయాత్రలో రైతుల కష్టాలు, సమస్యలను స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు నష్టపోకూడదనే వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా గ్రామస్థాయిలోనే ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలను సకాలంలో అందిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టి నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడానికి రైతుకు అవకాశం కల్పించారు.

– ఈరలక్కప్ప, మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వ్యవసాయంపై ఆసక్తి పెంచారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాతనే వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెంచారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు ఆర్థికాభివృద్ధికి కృషి చేశారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులతో రైతులు నష్టపోకుండా నాణ్యమైన విత్తనాలు ఎంచునేందుకు రైతులకు అందుబాటులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను తీసుకొచ్చారు. ఉచితంగా పరీక్షలు చేస్తూ నకిలీ విత్తనాలకు చెక్‌పెట్టారు.

– నారాయణస్వామి, రైతు, భీమరాయనపల్లి

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌తో ప్రయోజనం



మడకశిరలో అగ్రి టెస్టింగ్ ట్యాబ్ ఏర్పాటు చేయడంతో రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంది. అగ్రి టెస్టు ల్యాబ్ ద్వారా విత్తనాలు, ఎరువులు , పురుగు మందులను పరీక్షిస్తుండటంతో మంచి దిగుబడులు పొందడానికి ఎంతో అనుకూలంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయాన్ని పండుగలా మార్చింది.

– రవికుమార్, రైతు, తురకవాండ్లపల్లి

క్లుప్తంగా

జగన్ వెంటే ముస్లిం మైనార్టీలు



గుడ్డంపల్లి వేణురెడ్డిని కలిసిన మైనార్టీ నాయకులు

హిందూపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమం అభివృద్ధితో పాటు రాజకీయంగా ఎదగడానికి చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ముస్లిం మైనార్టీలందరూ ఉంటామని హిందూపురం ముస్లిం, మైనార్టీ మతపెద్దలు, నాయకులు అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని చెప్పారు. రాజకీయ లబ్ధికోసం మతతత్వ పార్టీలతో పొత్తులు పెట్టుకుని మోసం చేస్తున్న చంద్రబాబును నమ్మబోమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కలసికట్టుగా హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపికమ్మ, ఎంపీ అభ్యర్థి బి.శాంతమ్మలను గెలిపిస్తామన్నారు.

పట్టు చీరల పట్టివేత

హిందూపురం అర్బన్: కర్ణాటక సరిహద్దున ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర తనిఖీ కేంద్రంలో ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు సోమవారం ఓ కారులో తరలిస్తున్న 230 పట్టు చీరలు పట్టుకొన్నారు. వాటిని విలువ కట్టి వాణిజ్య పన్నులశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు తనిఖీ అధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత




కారుతో పాటు పట్టుబడిన కర్ణాటక మద్యం

హిందూపురం అర్బన్: హిందూపురం– పాలసముద్రం రహదారిలో రాచపల్లి వద్ద సెబ్ పోలీసులు సోమవారం కారులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా పరిగి మండలం వన్నంపల్లికి చెందిన సాయినాథ్ కారులో 20 బాక్సుల (1920) మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మద్యం బాక్సులతో పాటు కారును సీజ్ చేసి సాయినాథ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐలు రామ్‌ప్రసాద్, కమలాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఉద్యోగులు



అనంతపురంలో టీడీపీ ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజినేయులు టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా తూతూ మంత్రంగా విధులకు హాజరవుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారంటున్నారు. అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకట ప్రసాద్ వెంట ఉంటూ ప్రచారపర్వంలో నిలిచారని చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో రామాంజినేయులు టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్న ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. దీంతో ఈ విషయంపై కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అధికారులు విచారించి వాస్తవాలను నిగ్గుతేల్చి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు.

ఘనంగా కరియమ్మ జలధి ఉత్సవం



జలధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని కె.శివరం గ్రామంలో వెలసిన కరియమ్మదేవి జలధి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళా తాళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకుని సమీప చెరువు వంక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు గంగా జలంతో శుద్ధి చేసి పూజలు చేశారు. అక్కడి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయం వరకూ తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

మడకశిరలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలి

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో సీఎం వైఎస్ జగన్

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సోమవారం భేటీ అయినట్లు వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. జిల్లాలో సాగుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముదిగుబ్బకు చేరుకున్న సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతుందని ఆరా తీశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించినట్లు వివరించారు. మడకశిర నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయాలని చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రచారాన్ని నిర్వహించాలని సీఎం సూచించారని పేర్కొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, గుట్టూరు, అమ్మవారిపల్లి, శెట్టిపల్లి పంచాయతీ గ్రామాల్లో మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ మంగళవారం పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాలని సూచించారు.

రొద్దం: ఎన్నిక ప్రచారంలో భాగంగా మండలంలోని రాచూరు, రాగిమేకులపల్లి గ్రామాల్లో మంగళవారం పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిమ్మయ్య తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు పర్యటన ఉంటుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై మంత్రి పర్యటన విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



గుడ్డంపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక

- ప్రచారంలో హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

హిందూపురం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీఎస్.దీపిక అన్నారు. సోమవారం హిందూపురం మండలంలోని గోళాపురం, గుడ్డంపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు. మే 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి టీడీపీ అండ్‌కోకు సరైన గుణపాఠం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు చేసిన మేలు గుర్తు చేసుకోవాలన్నారు. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే తీసుకొచ్చారన్నారు. పింఛన్ల కోసం, సమస్యల పరిష్కారాల కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగకుండా ఇంటి ముంగిటకే వచ్చి సమస్యలు పరిష్కారం చూపించారన్నారు. పేద ప్రజలకు మేలు చేసే జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. మంచి కొనసాగాలంటే జగనన్న గెలవాలన్నారు. త్వరలోనే జగనన్న వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టో విడుదల చేస్తారని, మరింత రెట్టింపు ప్రజా సంక్షేమానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు.

బాలకృష్ణ హైదరాబాద్‌కే పరిమితం

హిందూపురం ప్రజలకు మేలు చేస్తాను.. అభివృద్ధి చేస్తానని చెప్పి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ హైదరాబాద్‌కు పరిమితం అయ్యారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక విమర్శించారు. చుట్టపు చూపుగా వచ్చి చేతులూపి వెళ్లిపోయే నటుడు ప్రజలకు ఏం మేలు చేస్తాడో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఒక్కసారి హిందూపురంలో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటోందో చేసి చూపిస్తామన్నారు. హిందూపురంలో 40 ఏళ్లుగా టీడీపీ వాళ్లే ఎమ్మెల్యేలుగా ఉన్నా ఏం అభివృద్ధి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో రేషన్‌కోసం, పింఛన్‌కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందో గుర్తుతెచ్చుకోవాలన్నారు. 2014 ఎన్నికల్లో కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కలసిలు కలసి ఉమ్మడిగా పోటీ చేసి 600 హామీలిచ్చి అధికారంలో వచ్చాక ప్రజలను మోసం చేసిన విషయాన్ని ఇంకా ఎవరూ మర్చిపోలేదన్నారు. టీడీపీ అండ్ కో చేతుల్లో ప్రజలు మళ్లీ మోసపోకుండా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. హిందూపురం చరిత్రలో ఎన్నడూలేని విధంగా మహిళలకు పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా శాంతమ్మను ఎంపిక చేశారన్నారు. మీ ఇంటి ఆడపడుచులుగా దీవించి ఓట్లు వేసి వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దుర్మార్గం

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ఆగ్రహం

హిందూపురం: అవ్వ తాతలు, వితంతు, వికలాంగులకు ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీని టీడీపీ అధినేత చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సీఎం జగనన్న సాకారం చేశారన్నారు. నిస్వార్థంగా వలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి పింఛన్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. దీన్ని ఓర్వలేని చంద్రబాబు అండ్‌కో పేదలకు పింఛన్ అందకుండా చేయడం దుర్మార్గమన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్ కోసం క్యూలైన్లు కట్టి ఎదురుచూపు చూసే రోజులు తేవాలన్నదే చంద్రబాబు నీచబుద్ధి అని మండిపడ్డారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో రాజకీయంగా జగనన్నతో పోరాడాలి తప్ప ఇలాంటి నీచ రాజకీయాలకు తెర తీయడం సరికాదన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలకు ప్రజలే సరైన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మరో రెండు నెలలు ఓపిక పడితే మళ్లీ జగనన్న పాలనే వస్తుందని, లబ్ధిదారులందరికీ ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పెనుకొండ: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర , వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గన్న ఆధ్వర్యంలో గుట్టూరుకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ మంత్రి ఉషశ్రీచరణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని ప్రజలకు వివరించాలని, మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలని వారికి సూచించారు.

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు నాగరాజు, కార్యకర్త మారుతీ తదితరులు సోమవారం రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: అమ్మాయిల చదువే వారి ఉన్నత భవిష్యత్తుకు రాచబాట వేస్తుందని, పిల్లలు బాగా చదువుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సరస్వతి, అధ్యాపకులు డాక్టర్ శ్రీలక్ష్మీ, గోపాల్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సప్తపది సాధించుకోవడమే ధ్యేయం

హిందూపురం: ఏడు అడుగులతో శుభం ఎలా జరుగుతుందో అలా హిందూపురంలో అభివృద్ధి సప్తపది లక్ష్యాలను సాధించుకోవడమే ధ్యేయమని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామిజీ అన్నారు. సోమవారం గుడ్డం రంగనాథస్వామి ఆలయ సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు పోటీ చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు. టికెట్ విషయంలో బీజేపీ అధిష్టానంతో సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. నామినేషన్లు వేసే వరకు ఇంకా సమయం ఉందన్నారు.

చోరీకి విఫలయత్నం

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ సమీపంలో ఆవుల చోరీకి దొంగలు విఫల యత్నం చేశారు. రైతు అభిశేఖర్‌రెడ్డి తన ఇంటి ముందు షెడ్డులో ఆవులను కట్టేసి ఉండగా సోమవారం తెల్లవారుజామున దుండగులు చొరబడి ఆవు అపహరణకు యత్నించారు. కుక్కలు మొరగడంతో దొంగలు వెనుతిరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ముగిశాయి. లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి వారి మూల విగ్రహాన్ని ప్రత్యేకంగా అభిషేకించారు. అనంతరం పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పంచలోహ కవచాలు, పూలతో అలంకరించి మహామంగళారతి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

3న అసెస్‌మెంట్ క్యాంపు

మడకశిరరూరల్: మడకశిర భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఈ క్యాంపును మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, రొద్దం మండలాల్లోని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరీక్ష ఫలితాల విడుదల

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా సీట్ల భర్తీ కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 10న ప్రవేశ పరీక్ష నిర్వహించామని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 789 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ప్రతిభ కనబరచిన 14 మందికి సీట్లు కేటాయించామన్నారు.

ఘనంగా శివకుమార స్వామి జయంతి

పావగడ: తుమకూరు క్యాత్సంద్ర సిద్ధగంగ మఠాధిపతి, కర్ణాటక రత్న దివంగత డా శివకుమార స్వామీజీ 117వ జయంతి వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబులెన్స్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల సందర్భంగా ఆస్పత్రిలోని రోగులు, ప్రజలకు అన్నదానం నిర్వహించారు. పాలనాధికారి ఏఎస్ఎల్ బాబు , వైద్యాధికారి తిరుపతయ్య, అంబులెన్స్ డ్రైవర్ల సంఘం పదాధికారులు అంబరీశ్, వెంకటేశ్, ఈరణ్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింటి ప్రచారం

రొళ్ల: మండలంలో బుధ, గురువారాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ హాజరవుతారన్నారు. బుధవారం హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రం నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

ద్విచక్ర వాహనం అపహరణ

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని మరువపల్లికి చెందిన ఆంజనేయులుకు చెందిన ద్విచక్ర వాహనం ఆదివారం రాత్రి అపహరణకు గురైంది. పొలం వద్ద వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా బైక్‌ను ఎత్తుకెళ్లారన్నారు. దీనిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

నవోదయకు ఎంపిక



కార్తీక్‌నాయక్

గుడిబండ: మండల పరిధిలోని ఎంఎస్ తండాకు చెందిన గోపీనాయక్, అంబికబాయ్ దంపతుల కుమారుడు జి కార్తీక్‌నాయక్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల నవోదయ ప్రవేశ పరీక్షలు రాశాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ తరగతి నవోదయ ప్రవేశానికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అశ్వత్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా సంపత్

హిందూపురం టౌన్: భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎస్ఎస్‌యూఐ) జాతీయ కార్యదర్శిగా హిందూపురం పట్టణానికి చెందిన సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇందులో భాగంగానే సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో సంపత్‌కుమార్‌ను విద్యార్థి సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రహమత్, ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఐక్యవిద్యార్థి సంఘం నాయకులు అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామమూర్తి రాజీనామ చేశారు. సోమవారం ఎంపీడీఓ మునిస్వామికి తన రాజీనామను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశానన్నారు.

రొద్దంలో టెక్నికల్ అసిస్టెంట్ ..

రొద్దం: మండలంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నందిని తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి చెప్పారు. ఆరోగ్య పరిస్థితుల వల్ల ఆమె రాజీనామా చేశారన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న ఉదయం 11.30 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

సాయుధ బలగాల కవాతు

హిందూపురం అర్బన్: ప్రజలు స్వేచ్ఛగా ,నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణ పరిధిలోని కొల్లకుంట, కొట్నూరు గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు.